# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శనివారం | 6 డిసెంబర్ 2025 | పేజీలు 8




దుండిగల్ రెవెన్యూ కూల్చేసిన అక్రమ షెడ్డుకు, అనంతరం, విద్యుత్ అధికారుల ట్రాన్స్‌ఫార్మర్.. ఫైల్‌ఫోటో..




గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో గతంలో "2025 జూన్" నెలలో రెవెన్యూ పాక్షిక కూల్చివేతల.. (ఫైల్‌ఫోటో)

# భూదాన్ భూమి పరిరక్షణ...
# కాగితాలకే పరిమితమా..?

## గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్లు ప్రోత్సహిస్తున్న దుండిగల్ రెవెన్యూ..?

- ఆరు నెలలుగా ఒక అక్రమ షెడ్డుపై ఆర్ఐ ఉదాసీనతతో చర్యలకు దూరం..
- భూదాన్ భూమిలో మొక్కుబడిగా కూల్చేసిన షెడ్డుకు విద్యుత్ అధికారుల ట్రాన్స్‌ఫార్మర్..
- కొత్తగా మరో అక్రమ భారీ షెడ్డు నిర్మాణాన్ని దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోని వైనం..
- దుండిగల్ రెవెన్యూ అధికారులకు తెలిసే ఈ భూదాన్ భూమి ఆక్రమణలు..?
- గాగిల్లాపూర్‌లో 77.19 ఎకరాలు భూదాన్ భూములే, అధికారిక రికార్డులతో నిర్ధారణ..
- గతంలో పొరపాటున కొన్ని ఎన్ఓసీలు మంజూరు అయ్యాయని కలెక్టర్ స్పష్టత..
- తప్పులను సరిదిద్దుతూ సమగ్ర పరిశీలనతో, ప్రస్తుతం భూధాన్ భూములుగా నిర్ధారణ..
- ప్రజలు అధికారిక ఆధారాలే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించిన కలెక్టర్..
- రిజిస్ట్రేషన్ చట్టం - 1908, సెక్షన్ 22-ఏ ప్రకారం గత ఫిబ్రవరి 18న నిషేధిత జాబితా..



గాగిల్లాపూర్ సర్వే నెం. 145 భూదాన్ భూమిలో, అనుమతుల్లేని అక్రమ షెడ్డు నిర్మాణం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 5:** గాగిల్లాపూర్ భూదాన్ భూమిలోని అక్రమ షెడ్ల వ్యవహారంలోనూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.. అందుకు సాక్ష్యంగా ఆరు నెలల క్రితం (2025 జూన్‌లో) నిర్మించిన అక్రమ షెడ్డుపై రెవెన్యూ పాక్షికంగా (5 శాతం) కూల్చివేతలు ప్రత్యక్ష నిదర్శనం.. భూదాన్ భూమిలో సంబంధిత అక్రమ షెడ్డుపై చర్యల విషయాన్ని ప్రస్తావిస్తే, ఆర్ఐ రవికుమార్ కహానీలు షరా మామూలే..! ఈ అక్రమ షెడ్డుపై రెవెన్యూ అరకొర చర్యలకు, విద్యుత్ శాఖ చేతివాటం తోడైంది..! రెవెన్యూ కూల్చివేతల సమయంలో లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్,..! కూల్చేసిన తర్వాత అక్రమమని తెలిసినప్పటికీ..! నిబంధనలకు విరుద్ధంగా కరెంట్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం పలు విమర్శలకు దారితీస్తుంది.. ఏదిఏమైనప్పటికీ రెవెన్యూ అధికారుల మొక్కుబడి కూల్చివేతల ధోరణిలోనూ మార్పు రాదు.. విద్యుత అధికారులు తీరులోనూ మార్పురాదని నిరూపిస్తున్నారు. ఓవైపు తెలంగాణ ఉన్నత న్యాయస్థానం కూడా "పర్మిషన్- ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" లేకుండా విద్యుత్ సరఫరా ఇవ్వకూడదని మొట్టికాయలు వేస్తున్నా..! సంబంధిత అధికారుల తీరు మారడం లేదు.. గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డుని రెవెన్యూ అధికారులు కూల్చిన విషయం కళ్లెదుటె కనిపించినా..! గుడ్డిగా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం విశేషం..! "గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ నిర్మాణాలు" మరియు "ప్రభుత్వ భూముల కబ్జాల పట్ల" రెవెన్యూ వ్యవహరిస్తున్న తీరుపై "పెన్ పవర్" ప్రత్యేక కథనం..!

-2లో

ప్రభుత్వ భూముల పరిరక్షణలో దుండిగల్ గండిమైసమ్మ రెవెన్యూ యంత్రాంగం విఫలమవుతుంది.. అక్రమమని తెలిసినా, బాధ్యతా రహితంగా విధులు నిర్వర్తిస్తున్నారు.. మరోవైపు తహాశీల్దార్ కార్యాలయం సమీపంలోనే సర్వే నెం.120 ప్రభుత్వ భూమి నిత్య కబ్జాలకు వేదికగా మారింది.. ప్రజలకు, ప్రశ్నించే వారికి జవాబుదారీగా ఉండాల్సి అధికారులు ఫోన్‌లు ఎత్తకుండా..! ఫలానా వ్యక్తి ఫోన్ చేశారని, కబ్జాదారులకు గుట్టుగా సమాచారం ఇవ్వడం అలవాటై పోయింది.. ప్రశ్నిచిన మీడియాకు ప్రమాదం తలపెట్టే విధంగా రెవెన్యూ తీరు పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులకు చెప్పుకోడానికో సాకు..! ఉన్నతాధికారుల నుంచి ఓ అండ దొరికితే చాలు..!పొంతన లేని సమాధానం చెప్పడం కొత్తేమి కాదు.. ముఖ్యంగా ఇలాంటి వ్యవహారంలో దుండిగల్ రెవెన్యూ అధికారులకు వెన్నతో పెట్టిన విద్య.. బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో,అక్రమ షెడ్డుకు నోటీసులు ఇచ్చిన తహాశీల్దార్, నేటికీ చర్యలు శూన్యం..!

# రూ.60 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన
# హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్

- ప్రైవేటు పాఠశాల రెన్యువల్‌కు సంబంధించి లంచం డిమాండ్
- పక్కా ప్రణాళికతో వెంకట్ రెడ్డిని పట్టుకున్న ఏసీబీ
- జిల్లా ఇన్‌ఛార్జ్ డీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న వెంకట్ రెడ్డి



-3లో


# ముగిసిన పంచాయతీ ఎన్నికల
# నామినేషన్ల ప్రక్రియ..

హైదరాబాద్ పెన్ పవర్:పంచాయతీ ఎన్నికల్లో భాగంగా (డిసెంబర్ 05) నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. మూడో దశ నామినేషన్ల స్వీకరణలో భాగంగా ఆఖరి రోజు నామినేషన్లు స్వీకరించారు ఎన్నికల అధికారులు.

-3లో



# భూదాన్ భూమి పరిరక్షణ.. కాగితాలకే పరిమితమా..?




భూదాన్ భూమిగా సర్వే నెంబర్‌లతో చూడవచ్చు..

## తాజాగా భూదాన్ భూమిలో మరో అక్రమ షెడ్డు..


గాగిల్లాపూర్ భూదాన్ భూమి సర్వే నెంబర్. 145 లో మరో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం చేపట్టడం, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్పష్టమవుతుంది. భూదాన్ భూమిలో షెడ్డు నిర్మాణం ఫోటోలు పంపించినా, సంబంధిత ఆర్ఐకి ఫోన్ చేసినా స్పందించక పోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తుంది.. ఈ విషయాన్ని దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డికి వాట్సప్ ద్వారా ఫోటోలతో పాటు, కలెక్టర్ ఆదేశాల వివరాలు, పంపించినా సమాధానం లేదు.. దుండిగల్ రెవెన్యూ అధికారులకు, గాగిల్లాపూర్ భూదాన్ భూముల వ్యవహారంలో, గత ఫిబ్రవరి నెలలో కలెక్టర్ ఆదేశాలపై స్పష్టమైన అవగాహన ఉన్నప్పటికీ..! రెవెన్యూ నిర్లక్ష్యం, మరో తప్పుకు శ్రీకారం చుడుతున్నట్టు తెలుస్తోంది.. గతంలో ధరణీ లోపాలతో, గాగిల్లాపూర్ భూదాన్ భూములకు రెవెన్యూ యంత్రాంగం నుండి తప్పుడు "ఎన్‌వోసి"లు, జారీ చేసినట్టు స్వయంగా జిల్లా కలెక్టర్ దృష్టిలోనే ఉంది.. వాటిని రద్దుచేస్తూ..! 2025 ఫిబ్రవరి 15, 18, 25 తేదీలలో పక్కా ప్రణాళికతో కబ్జాల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు.. తక్షణమే రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ నిలిపివేయాలని, "ఎకరాలు 77-19 గుంటలు" భూదాన్ భూమి మొత్తం సెక్షన్ 22-ఎ నిషేధిత జాబితాలో పెట్టాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి..



రెవెన్యూ కూల్చివేతల నాటి ఫోటోలో, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేదని స్పష్టంగా కనిపిస్తుంది.. (ఫైల్‌ఫోటో)

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం గాగిల్లాపూర్ భూదాన్ భూముల కబ్జాలపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.. "టీ-టైమ్" వెనుకవైపు భూదాన్ భూమిలో సుమారు 1000 గజాల్లో నిర్మించిన అక్రమ షెడ్డును, దుండిగల్ రెవెన్యూ అధికారుల కూల్చివేతలు అక్రమార్కులకు సానుకూలంగా ఉన్నట్టు నేటికీ స్పష్టంగా కనిపిస్తుంది..కేవలం 5 శాతం మాత్రమే అక్రమ షెడ్డును కూల్చేసిన ఆర్ఐ, ఎప్పటిలాగే ఓ కహానీ వినిపించారు..! ఖరీదైన విద్యుత్ పరికరాలు ఉన్నాయని, పెన్ పవర్ ప్రతినిధితో తెలిపారు.. వీళ్ళే (రెవెన్యూ) ఇలా ఉన్నారంటే.. విద్యుత్ అధికారులు ఆస్కార్ అవార్డు ఇచ్చినా తప్పులేదు.. రెవెన్యూ అధికారులు కూల్చేసిన అరకొర చర్యల అనంతరం..! సంబంధిత అక్రమ షెడ్డుకు "విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్" ఏర్పాటు చేయడం విశేషం.. గాగిల్లాపూర్ భూదాన్ భూములను, "సెక్షన్ 22-ఎ నిషేధిత జాబితా" నుంచి తొలగించి తప్పుడు "రెవెన్యూ ఎన్‌వోసి"లు జారీ చేశామని, పొరపాటును గ్రహించిన అప్పటి మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు..! "2025 జనవరి 28న" రిజిస్ట్రేషన్ శాఖకు లేఖను రాశారు.. దీంతో 2025 ఫిబ్రవరి 18న రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ నుండి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్‌కి మెమో సిద్ధం చేసి..! 2025 ఫిబ్రవరి 25న ఇన్‌వార్డ్‌లో అందజేశారు..! అప్పటి నుండి గాగిల్లాపూర్ భూదాన్ భూమి రెవెన్యూ పర్యవేక్షణలో ఉండాలని, కబ్జాకు గురికాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ స్పష్టతను ఇచ్చారు..! అయినప్పటికీ దుండిగల్ రెవెన్యూ అధికారులు "2025 మే-జూన్ నెలలో" భారీ షెడ్డును నిర్మిస్తుంటే తెలియక పోవడం బాధాకరం..! పెన్ పవర్ ప్రతినిధి ఆధారాలతో, స్థానిక ఆర్ఐకి అక్రమ షెడ్డు ఫోటోలు పంపించి, వివరణ కోరగా..! మొక్కుబడిగా ముందు భాగంలో పాక్షికంగా కూల్చేసి చేతులు దులుపుకున్నారు.. ఇదేమిటని ప్రశ్నిస్తేద ఖరీదైన వస్తువులు ఉన్నాయి, ఖాళీ చేసుకునే అవకాశం కల్పించామని ఆర్ఐ రవికుమార్ కితాబిచ్చారు.. కోట్లు విలువైన ప్రభుత్వ భూమి కబ్జాచేశారనే బాధ లేకపోయినా..! కబ్జాదారుల విలువైన వస్తువులు ఉన్నాయని మీడియాకు చెప్పడం విశేషం.. ఇదే ధోరణి పేదల ఇళ్ళ కూల్చివేల్లో ఎందుకు పాటించడం లేదో కానీ..? సామాగ్రిని, పేదలను బయట పడేసి కూల్చేస్తారు కదా.. మరి అక్కడ పేదలకు నష్టం వాటిల్లితే పర్వాలేదా..? పలుకుబడి ఉన్నోళ్ళకు, సిఫార్సులు చేసినాళ్ళకే దుండిగల్ రెవెన్యూ అధికారులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు స్పష్టతనిస్తున్నారు..



పెన్ పవర్

తెలంగాణ రౌండప్

కూల్చేసిన అక్రమ షెడ్డుకు..!

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మొక్కుబడిగా రెవెన్యూ చర్యలు..!విద్యుత్ అధికారుల ట్రాన్స్‌ఫార్మర్..

2025 ఆగష్టు 18న వార్త వచ్చినా. షెడ్డును కూల్చేయలేదు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించలేదు.

గండిమైసమ్మ - దుండిగల్ మండలం గాగిల్లాపూర్ గ్రామంలో ఉన్న భూధాన్ భూముల విషయంలో తుది స్పష్టత వచ్చింది. గతంలో కొన్ని భూములను పొరపాటున పట్టా భూములతో సమానంగా పరిగణించి ఇచ్చిన ఎన్‌ఓసీల జారీ తప్పేనని, మొత్తం 77 ఎకరాలు19 గుంటల విస్తీర్ణం భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందిన ప్రభుత్వ భూములేనని, 2025 ఫిబ్రవరి నెలలో మేడ్చల్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులు అధికారికంగా స్పష్టతను ఇచ్చారు.. గాగిల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 138, 139, 140, 141, 142, 143, 144, 145, 146, 147, 148, 150, 151, 155, 161, 165లో ఉన్న భూములు 1953 సంవత్సరంలోనే శ్రీ మూల్‌చంద్, శ్రీ వి. సుబ్బారావుల ద్వారా భూధాన్ యజ్ఞ బోర్డుకు విరాళంగా (రాజీనామా ఫారం%-%1 ద్వారా) అప్పగించబడినట్లు అధికారిక రికార్డులు నిర్ధారిస్తున్నాయి.. ఈ విరాళాలను అప్పటి తహసీల్దారు 1953లో ఆమోదించగా, 1965లో భూధాన్ భూముల జాబితాను అధికారికంగా నమోదు చేశారు. అయితే, 1965లో తహసీల్దారు లేఖను తప్పుగా అర్థం చేసుకోవడం వల్ల, భూధాన్ భూముల్లోని కొంత భాగాన్ని పట్టా భూములుగా భావించి, గతంలో కొన్ని "రెవెన్యూ ఎన్‌వోసీ"లు జారీ అయ్యాయని. ఈ నేపథ్యంలోనే ధరణి పోర్టల్‌లో కొన్ని సర్వే నంబర్లను తప్పుగా నిషేధిత జాబితా నుంచి తొలగించారని అధికారులు గుర్తించారు.. ఈ తప్పుడు ప్రక్రియను సరిదిద్దుతూ, మేడ్చల్%-%మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కమిషనర్ కార్యాలయం, మేడ్చల్ రిజిస్ట్రార్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంపు... స్వాగతించిన మంత్రి అజారుద్దీన్

- 'ఉమీద్' పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ గడువు పొడిగించిన కేంద్రం
- మూడు నెలల పాటు పెనాల్టీ ఉండదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడి
- కేంద్రం నిర్ణయాన్ని స్వాగతించిన తెలంగాణ మైనారిటీ సంక్షేమ మంత్రి అజారుద్దీన్
- గడువు పొడిగించాలని గత నెలలోనే ప్రధానికి లేఖ రాసిన సీఎం రేవంత్ రెడ్డి
- సాంకేతిక సమస్యల వల్లే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని విజ్ఞప్తి



హైదరాబాద్ పెన్ పవర్:దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను 'ఉమీద్' పోర్టల్‌లో నమోదు చేసేందుకు విధించిన గడువును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ స్వాగతించారు. ఈ అదనపు సమయాన్ని సద్వినియోగం చేసుకొని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు, ముతావల్లీలకు (ఆస్తుల సంరక్షకులు) ఆయన పిలుపునిచ్చారు.కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయంపై కీలక ప్రకటన చేశారు. వక్ఫ్ ఆస్తుల నమోదుకు శుక్రవారంతో గడువు ముగిసినప్పటికీ, మరో మూడు నెలల పాటు ఎలాంటి జరిమానా విధించబోమని స్పష్టం చేశారు. ఈలోగా నమోదు చేసుకోలేని వారు తమ రాష్ట్రాల్లోని వక్ఫ్ ట్రిబ్యునళ్లను సంప్రదించవచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 9 లక్షల వక్ఫ్ ఆస్తులకు గాను, ఇప్పటివరకు కేవలం 1.51 లక్షల ఆస్తులు మాత్రమే పోర్టల్‌లో నమోదయ్యాయని కేంద్ర మంత్రి తెలిపారు.గడువు పొడిగించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. సాంకేతిక సమస్యలు, శతాబ్దాల నాటి రికార్డుల లభ్యతలో జాప్యం, ముతావల్లీలకు ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని ఆయన ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అన్ని ఆస్తుల వివరాలను కచ్చితత్వంతో, పారదర్శకంగా నమోదు చేసేందుకు కనీసం ఏడాది పాటు గడువు పొడిగించాలని కోరారు."వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, పారదర్శకతను బలోపేతం చేయడానికి ఈ గడువు పొడిగింపు చాలా ముఖ్యం. దీనివల్ల తెలంగాణ ప్రజలకు ఈ సంస్థల ద్వారా అందే సేవలు, మద్దతు నిరంతరాయంగా కొనసాగుతాయి" అని మంత్రి అజారుద్దీన్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# పుతిన్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక కానుకలు... ప్రతి వస్తువు వెనుక ఓ అర్థం!

హైదరాబాద్ పెన్ పవర్:భారత పర్యటనకు విచ్చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ప్రత్యేకమైన బహుమతులను అందజేశారు. ఇవి కేవలం వస్తువులు కావు, భారతీయ సంస్కృతి, వారసత్వం, హస్తకళల గొప్పతనానికి అద్దం పట్టే ప్రతీకలు. 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా పుతిన్‌కు ఈ కానుకలను అందించారు. ప్రతి బహుమతిని ఎంతో ఆలోచించి, ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహబంధాన్ని ప్రతిబింబించేలా ఎంపిక చేయడం విశేషం.ఈ కానుకల్లో అత్యంత ముఖ్యమైనది రష్యన్ భాషలోకి అనువదించిన "శ్రీమద్ భగవద్గీత". శ్రీకృష్ణుడి బోధనల సారాంశమైన గీత, నైతిక జీవనం, మానసిక నియంత్రణ, అంతర్గత శాంతికి మార్గం చూపుతుంది. తన మిత్రుడైన పుతిన్ సులభంగా చదివి, అర్థం చేసుకునేందుకే మోదీ ప్రత్యేకంగా రష్యన్ అనువాదాన్ని బహూకరించారు. దీనితో పాటు, జీఐ (%+×%) ట్యాగ్ పొందిన ప్రసిద్ధ అస్సాం బ్లాక్ టీని కూడా అందించారు. అసామికా మొక్క ఆకుల నుంచి సంప్రదాయ పద్ధతిలో తయారయ్యే ఈ టీ, ప్రత్యేకమైన రుచికి, ఆరోగ్య ప్రయోజనాలకు పెట్టింది పేరు.



పశ్చిమ బెంగాల్ కళా నైపుణ్యానికి ప్రతీకగా నిలిచే ముర్షిదాబాద్ వెండి టీ సెట్‌ను కూడా పుతిన్‌కు బహూకరించారు. దీనిపై ఉన్న సూక్ష్మమైన నగిషీలు ఆకట్టుకుంటాయి. భారత్, రష్యా సమాజాల్లో టీకి ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యతను ఇది తెలియజేస్తుంది. ఈ వెండి టీ సెట్ ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహానికి, ఆప్యాయతకు చిహ్నంగా నిలుస్తుంది.

మహారాష్ట్రకు చెందిన చేతితో తయారుచేసిన వెండి గుర్రం మరో ప్రత్యేక ఆకర్షణ. ఇది భారత లోహ హస్తకళా నైపుణ్యానికి నిదర్శనం. ముందుకు దూకుతున్న భంగిమలో ఉన్న ఈ గుర్రం, కాలపరీక్షకు నిలిచి నిరంతరం పురోగమిస్తున్న భారత్-రష్యా భాగస్వామ్యానికి ప్రతీక. అంతేకాకుండా, ఇరు దేశాల సంస్కృతులలో గౌరవించే ధైర్యం, పరాక్రమానికి కూడా ఇది చిహ్నం."ఒక జిల్లా-ఒక ఉత్పత్తి" (%ఒణుత్రా%) పథకంలో భాగంగా ఆగ్రాకు చెందిన చేతితో రూపొందించిన పాలరాతి చదరంగం సెట్‌ను బహుమతుల్లో చేర్చారు. ఉత్తర భారత కళా నైపుణ్యాన్ని చాటిచెప్పే ఈ చదరంగం బోర్డు, పావులు అందరినీ ఆకట్టుకుంటాయి. పాలరాయి, చెక్క, విలువైన రాళ్లతో చేసిన ఈ సెట్, వ్యూహాత్మక మేధస్సుకు ప్రతీకగా నిలుస్తుంది.వీటన్నింటితో పాటు, కశ్మీర్ పర్వత ప్రాంతాల్లో పండే ప్రఖ్యాత కుంకుమపువ్వును కూడా అందజేశారు. 'రెడ్ గోల్డ్'గా పిలువబడే ఈ సుగంధ ద్రవ్యం గొప్ప రుచి, రంగు, సువాసనకు ప్రసిద్ధి. జీఐ ట్యాగ్ పొందిన ఈ కుంకుమపువ్వు స్థానిక రైతుల ఆర్థిక విలువతో పాటు, ప్రకృతి, సంప్రదాయం, హస్తకళల సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తుంది. మొత్తంగా ఈ కానుకలన్నీ భారతీయ వైవిధ్యాన్ని, ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల మైత్రిని చాటిచెప్పాయి.

## రూ.60 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రంలో ఒక అదనపు కలెక్టర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక ప్రైవేటు పాఠశాల రెన్యువల్ కోసం ఆయన లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.పాఠశాల యాజమాన్యం ఈ విషయంపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసింది. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం వెంకట్ రెడ్డితో పాటు జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వెంకట్ రెడ్డి హన్మకొండ జిల్లా ఇన్‌ఛార్జ్ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## ముగిసిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ..

- మొదటి పేజి తరువాయి

చివరి రోజు కావడంతో నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. సాయంత్రం 5 గంటల వరకే నామినేషన్లు స్వీకరించాల్సి ఉన్నా.. ఎక్కువ మంది నామినేషన్లు వేయడంతో కేంద్రాలన్నీ కిటకిటలాడాయి. గడువు లోను నామినేషన్ కేంద్రాలలోకి వచ్చిన అభ్యర్థులకు టోకెన్లు ఇచ్చి ఆలస్యంగానైనా నామినేషన్లను స్వీకరించారు అధికారు. (డిసెంబర్ 05)మూడో దశ ఆఖరిరోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. మూడో విడతలో మొత్తం182 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా 4 వేల159 సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు వేశారు. శనివారం (డిసెంబర్ 06) మూడో దశ నామినేషన్ల పరిశీలన ఉంటుంది. డిసెంబర్ 9న ఉపసంహరణ ఉంటుంది.

## ముమ్మాటికి పోలీసుల హత్య

హైదరాబాద్ పెన్ పవర్:ఓ దళిత యువకుడు రాజేష్ ను ఆకారణంగా కేసులో విచారణ పేరుతో పోలీసులు హత్య చేశారని ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై హై కోర్టు సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ కమిషన్ ప్రత్యేక బృందం విచారణ జరిపించాలని అన్నారు. సంబంధిత అధికారులందరినీ తక్షణం విధులు నుంచి తొలగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో స్థానిక ఎన్నికలు ఉన్నాయి. జిల్లా ఎస్పీ తప్పు చేసిన అధికారులను కాపాడుకోవడానికి ప్రయోగించడం సమంజసం కాదని అన్నారు.

## ఇండిగోలో తీవ్ర సర్వీస్‌ల్లో తీవ్ర అంతరాయం

హైదరాబాద్ పెన్ పవర్: ఇండిగో సర్వీస్‌లు వరుసగా బ్రేక్‌డౌన్ అవుతున్నాయి. గురువారం ఐదు వందలకుపైగా సర్వీస్‌లు నిలిచిపోయాయి. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. సాంకేతిక కారణాలతోనే ఇదంతా జరుగుతోందని ఇండిగో సంస్థ ప్రకటించింది. ఇండిగో సంస్థ తీరుపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆ సంస్థకు వ్యతిరేకంగా శంషాబాద్ విమానాశ్రయంలో అయ్యప్ప స్వాములు నిరసన చేపట్టారు. వందల మంది భక్తులు శబరిమలై వెళ్లేందుకు విమాన టికెట్లను బుక్ చేసుకున్నారు. మరికొందరు కేరళ నుంచి వివిధ ప్రాంతాలకు వచ్చేందుకు టికెట్లు బుక్ చేసుకున్నారు. అయితే గురువారం నుంచి వారు బయల్దేరాల్సిన విమానాలు రద్దు చేస్తున్నట్టు ఇండిగో సంస్థ ప్రకటించింది. అయితే వారంతా తమ గమ్య స్థానాలకు వెళ్లేందుకు ముందుగానే విమానాశ్రయానికి చేరుకున్నారు. కానీ దాదాపు గంటలు గడుస్తున్నా తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం తో స్వాములు ఆందోళన చేపట్టారు. విశాఖ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కేరళ అన్ని ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి కనిపిస్తోంది. స్వాములతో పాటు సామాన్య భక్తులు కూడా ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రండి: జమ్మూకశ్మీర్ CM ఒమర్ అబ్దుల్లాకు మంత్రి ఉత్తమ్ ఆహ్వానం






**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్-2047? గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవ్వాలని జమ్మూకశ్మీర్ ముఖ్య మంత్రి ఒమర్ అబ్దుల్లాను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. న్యూఢిల్లీలోని జమ్ముకశ్మీర్ హౌస్‌లో సీఎం ఒమర్ అబ్దుల్లాను శుక్రవారం (డిసెంబర్ 5) మంత్రి ఉత్తమ్ కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్? సమ్మిట్‌ఆహ్వాన పత్రికను జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు ఉత్తమ్ కుమార్ రెడ్డి అందజేశారు.

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్?-2047 విజన్? డాక్యుమెంట్?ను రూపొందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. నీతి అయోగ్?సలహాలు సూచనలతో పాటు.. అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్? డాక్యుమెంట్?ను గ్లోబల్?సమ్మిట్?లో ఆవిష్కరించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒమర్ అబ్దుల్లాకు వివరించారు.

ఈ సందర్భంగా సీఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కి ఆహ్వానించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి, స్వయంగా ఆహ్వానపత్రాన్ని అందచేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సమ్మిట్?కు ప్రత్యక్షంగా హాజరు కాలేకపోతున్నానని కానీ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆశిస్తున్నానని అన్నారు. అదేవిధంగా హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందని విశ్వసిస్తున్నానని చెప్పారు.

# నా కొడుకైనా తప్పు చేస్తే శిక్ష తప్పదు: మంత్రి పొంగులేటి

- తమ కుటుంబ సంస్థ రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై కేసుపై పొంగులేటి స్పందన
- అధికారాన్ని అడ్డుపెట్టుకొని కేసును ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని వ్యాఖ్య
- విచారణకు పూర్తి స్వేచ్ఛనిస్తామన్న పొంగులేటి



**హైదరాబాద్ పెన్ పవర్:**తప్పు చేస్తే తన కుమారుడైనా శిక్షకు అర్హుడేనని, చట్టం ముందు అందరూ సమానమేనని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తన కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై నమోదైన భూ వివాదం కేసుకు సంబంధించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

కొంతకాలం క్రితం, ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూమిలోకి జేసీబీలతో ప్రవేశించి కూల్చివేతలకు పాల్పడ్డారనే ఆరోపణలతో రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాక్ష్యాధారాలతో కూడిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, దౌర్జన్యం కింద కేసు నమోదు చేశారు. ఈ విషయంపై అధికారులతో జరిగిన ఓ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, "తప్పు చేసినప్పుడు నేను అయినా, నా కొడుకు అయినా శిక్ష అనుభవించాల్సిందే. ప్రతిపక్షాలు కేసులు పెట్టించాయని చెప్పడం సరికాదు. మేము ప్రభుత్వంలో ఉన్నామని నా కుమారుడిపై కేసు నమోదు చేయవద్దని చెప్పే ఉద్దేశం మాకు లేదు" అని అన్నారు. కేసు నమోదైన తర్వాత విచారణలో నిజ నిర్ధారణ జరుగుతుందని, తప్పు తేలితే చట్ట ప్రకారం శిక్ష పడుతుందని ఆయన వివరించారు. ఒకవేళ ఆరోపణల్లో నిజం లేకపోతే, వార్తలు రాసిన వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి వ్యాఖ్యానించారు.

# నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన మైండ్ స్పార్క్ సాఫ్ట్వేర్ కంపెనీ

**హైదరాబాద్ పెన్ పవర్::**మాదాపూర్ లో మరో కంపెనీ దుకాణం ఎత్తేసింది. మెడికల్ కోడింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షలు వసూలు చేసిన మైండ్స్ పార్క్ సంస్థ మూతపడింది. మెంటర్ శ్రీకాంత్ జోషి నిరుద్యోగుల దగ్గర నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేసి రాత్రికి రాత్రి రే పరారైయాడు. ఒక్కొక్క నిరుద్యోగ దగ్గర నుంచి సుమారు లక్ష నుంచి 2 లక్షలు వసూలు చేసారు. సుమారు 80 నుంచి 100 మంది బాధితులు వున్నారు. శ్రీకాంత్ జోషితోపాటు దిలీప్ శివారెడ్డి పైన కూడా బాధితులు ఫిర్యాదు చేసారు. ఈ నేపధ్యంలో బాధితులు మాదాపూర్ లోని క్యాపిటల్ పార్క్ దగ్గర నిరుద్యోగ బాధితులు ఆందోళన కు దిగారు.

## నాలుగు రోజుల్లో రూ.600కోట్ల లిక్కర్ తాగారు..తెలంగాణలో రికార్డు స్థాయిలో అమ్మకాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. కేవలం నాలుగు రోజుల్లో రూ. 600కోట్లు లిక్కర్ తాగారు మనోళ్లు. డిసెంబర్ 1 నుంచి 4 వరకు భారీగా అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 107 శాతం లిక్కర్ సేల్స్ పెరిగాయి. గమ్మత్తయిన విషయం ఏంటంటే.. చలికాలంలో కూడా బీర్ల అమ్మకాలు భారీగా ఉండటం.ఎండాకాలంలో బీర్ల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి.. కానీ పొద్దున, రాత్రి చలి విపరీతంగా సమయంలో కూడా అత్యధికంగా బీర్లు అమ్ముడయ్యాయి. నాలుగు రోజుల్లో 5.89లక్షల కేసుల బీర్లు తాగారట .గతేడాది ఇదే సమయంలో కేవలం 4లక్షల 29కేసుల బీర్లు మాత్రమే అమ్ముడయ్యాయని ఎక్సైజ్ డిపార్టుమెంట్ లెక్కలు చెబుతున్నాయి. కొత్త మద్యం పాలసీ, ఊర్లలో సర్పంచ్ ఎన్నికల సందర్భంగా లిక్కర్ అమ్మకాలు భారీగా పెరిగినట్లు ఎక్సైజ్ అధికారులు అంటున్నారు.

ఇంతకుముందు దసరా సందర్భంగా కూడా తెలంగాణలో మద్యం అమ్మకాలు రికార్డు సృష్టించాయి. దసర పండుగా, గాంధీ జయంతి రెండూ ఒకే రోజు వచ్చినప్పటికీ మద్యం అమ్మకాల జోరు తగ్గలేదు. దసరా పండుగకు రూ.419 కోట్లు మద్యం తాగేశారు మనోళ్లు.

## ఈశ్వర్ మరణానికి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కారణం: కేటీఆర్ ఆరోపణ

- బీసీ రిజర్వేషన్ల పేరిట రేవంత్ రెడ్డి దారుణ మోసం చేశారన్న కేటీఆర్
- బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇచ్చిన హామీకు కాంగ్రెస్ తూట్లు పొడిచిందని విమర్శ
- శ్రీసాయి ఈశ్వర్ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీసాయి ఈశ్వర్ మృతికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన దారుణ మోసానికి ఈశ్వర్ నిండు ప్రాణం బలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని తట్టుకోలేక శ్రీసాయి ఈశ్వర్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికి కుదించడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు.ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యే అని ఆయన విమర్శించారు. కులగణన మొదలు న్యాయస్థానాల్లో నిలబడని జీవోల వరకు కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్‌కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. శ్రీసాయి ఈశ్వర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీ లో భారీ చేరికలు




**హైదరాబాద్ పెన్ పవర్:**కమలం పార్టీలో నుండి కాంగ్రెస్ పార్టీలోకి కంటోన్మెంట్ లో భారీ చేరికలు. మోండా డివిజన్ మహిళా మోర్చా నాయకురాళ్ళు మాలతి, మాధవి తమ అనుచరులతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా కొత్త పాత అని తేడా లేకుండా అందరూ కలసి కట్టుగా పని చేయాలని పార్టీ శ్రేణులకు శ్రీ గణేష్ సూచించారు.

## బీసీ జేఏసీ అందోళన

**హిమాయత్ నగర్ పెన్ పవర్:**

బిసి రిజర్వేషన్ల కోసం ఆత్మబలిదానం చేసుకున్న సాయి ఈశ్వర్ చారి మృతిపట్ల తెలంగాణ బిసి విద్యార్థి జేఏసీ ఆందోళనకు దిగింది. హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ వేముల రామకృష్ణ మాట్లాడుతూ... 12 వందల మంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే , తెలంగాణ రాష్ట్రం వచ్చిందని , ఇప్పుడు రిజర్వేషన్ల కోసం ఎంత మంది బిసిలు బలిదానాలు చేసుకుంటే ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగానే సాయి ఈశ్వర్ ఆత్మ బలిదానం చేసుకున్నారని ఆరోపించారు. తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సాయి ఈశ్వర్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు రెండు కోట్లు నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని వేముల రామకృష డిమాండ్ చేశారు.

## కారులో కోట్ల హవాలా నగదు..

**హైదరాబాద్: పెన్ పవర్:**బోయిన్పల్లి పరిధిలో కారులో భారీగా నగదు లభ్యం కావడం కలకలం రేపింది. బోయిన్పల్లి క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కారు టైరు, సీట్ల కింద తరలిస్తున్న రూ.4 కోట్ల హవాలా నగదును పట్టుకున్నారు. దీన్ని తరలిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై పోలీసులు ఏడాదిగా నిఘా ఉంచారు.

## సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి లక్ష రూపాయల విరాళం

### అందించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్: పెన్ పవర్:**సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ని సైనిక్ వెల్ఫేర్ ప్రతినిధులు జూబ్లీ హిల్స్ నివాసం లో కలిసారు. సీఎం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ సందర్భంగా అయన బోల్డ్ అండ్ బ్రేవ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమం లో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, కెప్టెన్ శ్రీనేష్ కుమార్ ,కెప్టెన్ నరోత్తమ్ రెడ్డి ,కెప్టెన్ శ్రీనివాసులు తదితరలు పాల్గోన్నారు.

# మిడ్ మానేర్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ బోట్ లో షికార్



**హైదరాబాద్ పెన్ పవర్:**వేములవాడ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మిడ్ మానేర్ లో బోట్ లో షికారు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి మిడ్ మానేర్ జలాయశంతో ముంపునకు గురైన వరదవెల్లి గుట్టపై ఉన్న దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. భక్తులతో కలిసి భజనలు చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరద వెల్లి గుట్టపై దత్తాత్రేయ జయంతి ఉత్సవాల్లో వైభవంగా జరుగుతున్నాయి. మిడ్ మానేర్ జలాశయంతో వరదవెల్లి నీటమునిగి గుట్టపై ఉన్న ఆలయానికి వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. దీంతో ప్రతి ఏటా దత్తాత్రేయజయంతోత్సవాల సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బోట్లు ఏర్పాటు చేశారు. బోటులో వెళ్ళితే కానీ, స్వామివారి దర్శనం కాదు. ప్రస్తుతం జరుగుతున్న దత్త జయంతి ఉత్సవాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బోటులో దత్తాత్రేయ సన్నిధికి చేరారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ తోపాటు ఆది శ్రీనివాస్ భజనలు చేశారు. మిడ్ మానేర్ లో ముంపునకు గురైన వరదవెల్లి గుట్టపై ఉన్న దత్తాత్రేయ స్వామిని నిత్యం భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు. బ్రిడ్జి కం రోడ్డు నిర్మాణానికి ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. దత్తాత్రేయ స్వామి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని గురుదత్తను వేడుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

# మల్యాల తహశిల్దార్ కార్యాలయంలో జిపివో ప్రవీణ్ సస్పెండ్...

**జగిత్యాల పెన్ పవర్:**మల్యాల తహశిల్దార్ కార్యాలయంలో జీపీవో ప్రవీణ్ అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయ్యారు. ప్రవీణ్ తోపాటు జవ్వాజి జలజ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మల్యాల తహశిల్దార్ కార్యాలయంలో పనిచేసే జిపివో %జు%. ప్రవీణ్ తాటిపల్లి గ్రామానికి చెందిన జవ్వాజి జలజతో కలిసి పహాణీల్లో భూమి విస్తీర్ణం అక్రమంగా పెంచిన ఘటన బయటపడింది. తాటిపల్లికి చెందిన జవ్వాజి జలజ, కొన్ని సంవత్సరాల పహాని సర్టిఫైడ్ కాపీల కోసం తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, భూమి విస్తీర్ణాన్ని పెంచి నమోదు చేయాలని ప్రవీణ్ను కోరినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రవీణ్ కొన్ని రోజుల క్రితం తాటిపల్లి గ్రామంలో ఉన్న కొన్ని సర్వే నంబర్లలో అసలు ఉన్నదానికంటే 2.20 ఎకరాలు ఎక్కువగా నమోదు చేసి పహాణీలో ట్యాంపరింగ్ కు పాల్పడ్డాడు. అసలు భూమి ఓనర్ అధికారులను ఆశ్రయించగా తహశిల్దార్ విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. పహణీలో భూమి నమోదులో అవకతవకలకు పాల్పడినట్లు రుజువు కావడంతో ప్రవీణ్ ను సస్పెండ్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. దీంతో మల్యాల పోలీసులు జిపివో ప్రవీణ్ తోపాటు జవ్వాజి జలజపై కేసు నమోదు చేశారు. గతంలో ఇంకా ఏమైనా అవకతవకలకు పాల్పడ్డాడ అని విచారణ చేపట్టినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

# రెపో రేటు తగ్గించిన ఆర్ బీఐ

**హైదరాబాద్ పెన్ పవర్:**

భారతీయ రిజర్వ్ బ్యాంక్ మానిటరీ పాలసీ కమిటీ రెపో రేటును 25 bps తగ్గించి 5.25 శాతం చేయడానికి నిర్ణయించింది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం దీనిని ప్రకటించారు. రిజర్వ్ బ్యాంక్ ఈ ప్రకటనతో, ఇప్పుడు రెపో రేటు 5.5 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గింది. రెపో రేటు తగ్గడం వల్ల రుణాలు చౌకగా మారతాయి, దీనివల్ల పై ఖర్చు తగ్గుతుంది. పొదుపు పెరుగుతుంది. దీనికి ముందు, అక్టోబర్ 1న సమావేశం జరిగింది, ఇందులో రిజర్వ్ బ్యాంక్ రెపో రేటులో ఎటువంటి మార్పు చేయకుండా దానిని 5.5 శాతం వద్ద స్థిరంగా ఉంచింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ ఈరోజు కీలక రేట్లపై తుది నిర్ణయాన్ని ప్రకటించింది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన MPC, రెపో రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25 శాతానికి తగ్గించాలని నిర్ణయించింది. స్టాండింగ్ డిపాజిట్ సౌకర్యం ఇప్పుడు 5 శాతంగా ఉంది, మార్జినల్ స్టాండింగ్ సౌకర్యం, బ్యాంక్ రేటును 5.5 శాతానికి సవరించారు.ద్రవ్యోల్బణం మ్యూట్ అయి, వృద్ధి ఆరు త్రైమాసికాల గరిష్ట స్థాయికి చేరుకోవడంతో, ఒత్తిడి పెరుగుతోంది, అయితే RBI ఇప్పటికీ ముందుజాగ్రత్త పంథాను ఎంచుకుంటుందని భావించారు. ప్యానెల్ కీలక రేట్లను ఏకగ్రీవంగా తగ్గించడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థపై 'తటస్థ' వైఖరిని కూడా అవలంబించడం కొనసాగించింది.MPC కూడా తటస్థ వైఖరిని కొనసాగించాలని నిర్ణయించుకుంది" అని సంజయ్ మల్హోత్రా అన్నారు. ద్రవ్యలోటు పరిస్థితుల దృష్ట్యా, ఈ డిసెంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ రూ. 1 లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోళ్లను, వ్యవస్థలోకి దీర్ఘకాలిక ద్రవ్యతను ప్రవేశపెట్టడానికి 5 బిలియన్ US డాలర్ల మూడు సంవత్సరాల కొనుగోలు-అమ్మకపు స్వాప్‌ను నిర్వహిస్తుంది. ప్రధాన ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిందని, మునుపటి అంచనాల కంటే సాఫ్ట్‌గా ఉండే అవకాశం ఉందని పేర్కొంది."ఆర్థిక వ్యవస్థకు నిర్ణయాత్మక సమయంలో MPC%బుధవారం తన మూడు రోజుల చర్చలను ప్రారంభించింది. భారతదేశ వృద్ధి ఆరు త్రైమాసికాలలో అత్యంత వేగంతో పెరిగింది, అయితే ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో అత్యల్ప నెలవారీ రీడింగ్‌కు తగ్గింది. ఈ అరుదైన కలయిక వరుసగా నాలుగు సమావేశాల పాటు రేట్లను స్థిరంగా ఉంచిన తర్వాత RBI ద్రవ్య సడలింపును తిరిగి ప్రారంభించవచ్చునే మార్కెట్ ఊహాగానాలకు దారితీసింది.ఇంకా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దాని GDP అంచనాలను అప్‌గ్రేడ్ చేయాలని ప్యానెల్ నిర్ణయించింది. FY2025-26 సంవత్సరానికి GDP అంచనా ఇప్పుడు అర శాతం పెరిగి 7.3 శాతంగా ఉందని గవర్నర్ ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో Q3లో 7 శాతం, Q4లో 6.5 శాతం వృద్ధి అంచనాలను కూడా ఆయన పంచుకున్నారు.రాబోయే 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో, GDP 6.7 శాతం, రెండో త్రైమాసికంలో 6.8 శాతంగా అంచనా వేశారు.ద్రవ్యోల్బణం2026 ఆర్థిక సంవత్సరానికి MPC తన ద్రవ్యోల్బణ అంచనాలను 0.6 శాతం కోసి 2 శాతానికి తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో Q3, Q4 కోసం ద్రవ్యోల్బణ అంచనాలు ఇప్పుడు వరుసగా 0.6 శాతం, 2.9 శాతంగా ఉన్నాయి. FY27లో Q1, Q2 కోసం ద్రవ్యోల్బణ అంచనా వరుసగా 3.9 శాతం, 4 శాతంగా ఉంది.అక్టోబర్ సమీక్షలో, %పూజ% రెపో రేటును 5.5 శాతం వద్దే ఉంచారు. ఎలాంటి మార్పులు చేయలేదు. గవర్నర్ సంజయ్ మల్హోత్రా ద్రవ్యోల్బణం "తీవ్రంగా తగ్గిందని" పేర్కొన్నారు, ఇది ఓదార్పునిస్తుంది కానీ వైఖరిని మార్చడానికి ఇంకా సమయం రాలేదని చెప్పారు. అయితే, డిసెంబర్ సమావేశం మరింత అనుకూలమైన ఫలితం వచ్చింది, చివరకు 25 బేసిస్ పాయింట్ల రేటు తగ్గింపు పట్టికలో ఉండవచ్చునే అంచనాలను పెంచింది

# 100 కోట్ల అవినీతి

**హైదరాబాద్ పెన్ పవర్:**
పేద ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని యేళ్లుగా అవినీతికి అలవాటు పడిన మరో బడా తిమింగలం ఏసీబీ గాలంకి చిక్కింది. ఏకంగా రూ.100 కోట్లు కూడబెట్టడంతో అధికారులు కూడా షాకయ్యారు. అడ్డగోలుగా సంపాదించిన సొమ్ముతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలో భారీగా అక్రమాస్తులు కూడబెట్టాడు. రంగారెడ్డి జిల్లా సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కే శ్రీనివాస్ అవినితి చిట్టా ఇది. ఏపీబీ అధికారులు పకడ్బందీగా కాపుకాసి గురువారం (డిసెంబర్ 4) ఆయన కార్యాలయం, ఇల్లు, బంధువులు, స్నేహితులు, బినామీల ఇళ్లతో సహా మొత్తం 7 చోట్ల ఏకకాలంలో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో ఈ యవ్వారం బయటపడింది. ఈ క్రమంలో రంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో బయటపడ్డ శ్రీనివాసులు అక్రమాస్తుల మార్కెట్ విలువ సుమారు రూ.100 కోట్లకు పైమాటేనని లెక్కతేల్చారు.రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు కార్యాలయంలో ఏసీబీ అధికారులు 10 గంటలపాటు సోదాలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏసీబీ అధికారులు దర్యాప్తు జరిపారు. ఏడీ శ్రీనివాసులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రంగారెడ్డి జిల్లాలో విలువైన భూముల రికార్డులను తారుమారు చేసి కోట్ల రూపాయలు వెనకేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మణికొండ, నార్సింగి, వట్టినాగుల పల్లితోపాటు పలు ప్రాంతాల్లో భూవివాదాల్లో భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు రాయదుర్గంలోని మైహోమ్ భుజలో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. నల్లగొండ జిల్లాలో పని చేస్తున్నప్పుడు శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపితే.. పైఅధికారులు కుమ్మక్కై శిక్షించడానికి బదులు రంగారెడ్డి జిల్లా ఏడీగా మరో కీలక స్థానానికి బదిలీ చేశారు. అప్పట్నుంచి శ్రీనివాసులు మరింత రెచ్చిపోయి అందినకాడికి భారీగా కూడబెట్టుకున్నాడు. అంతేకాదు శ్రీనివాసులు పనిచేసిన ప్రతీచోట అతడిపై పెద్ద ఎత్తున ఆరోపణలు రాసాగాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ నేతృత్వంలోని బృందం తనిఖీలు చేపట్టింది

# వలస కూలీల పిల్లలను గుర్తించండి ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించాలి:




**హైదరాబాద్ పెన్ పవర్:**
జిల్లావ్యాప్తంగా వలస కూలీలు, కార్మికుల పిల్లలను గుర్తించి వారిని ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.
కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులు, ఇటుక బట్టీలు, పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ. సాధారణంగా వలస కూలీలు ఎక్కువగా పనిచేసే చోటే వర్క్ సైట్ స్కూళ్లు ప్రారంభిస్తారని తెలిపారు. కానీ పిల్లలకు పాఠశాల వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో వారి కుటుంబాలకు సమీపంగా ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక తరగతిలో బోధిస్తున్నామని అన్నారు.
ఇటుక బట్టీలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను గుర్తించి ఈ బడిలో చేర్పించాలని ఆదేశించారు. వారికి పోషకాహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ఇటుక బట్టీల యజమానులు వారి సాయంగా పిల్లలకి రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.
గత ఏడాది సుమారు 500 మంది వలస కూలీల పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించి విద్య అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది మరింత శ్రద్ధతో ప్రత్యేక పాఠశాలలపై దృష్టి పెట్టాలని అన్నారు.
ప్రత్యేక పాఠశాలల్లో చేరిన వలస కార్మికుల పిల్లలకి ఇంగ్లీషులో బోధించాలని సూచించారు. భవిష్యత్తులో వారికి చదువు పట్ల శ్రద్ధ పెరిగి ఎక్కడికి వెళ్ళినా చదువుకునే ఉత్సాహం ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను కూడా గుర్తించి బడిలో చేర్పించాలని అన్నారు. ఇప్పటికే 185 మంది పిల్లలను గుర్తించినట్లు విద్యాధికారులు తెలిపారు.

**పదవ తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టాలి:**

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూరు శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మండల విద్యాధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సాయం

**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ శుక్రవారం తన ఛాంబర్ లో అంతర్రాష్ట్ర సీనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్న క్రీడాకారులకు ఈ సాయం అందించడం ద్వారా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి కలెక్టర్ చొరవ చూపారు. ఈ అంతర్రాష్ట్ర సీనియర్ ఆర్చరీ పోటీలు ఈ నెల 11 మరియు 12 తేదీలలో తెలంగాణ రాష్ట్ర రాజధానియైన హైదరాబాదులో నిర్వహించబడతాయి.జిల్లా కలెక్టర్ శ్రీ దినేష్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచి, జిల్లాకు, రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలి అని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం అందుకున్న క్రీడాకారులను జిల్లా కలెక్టర్ తో పాటు, డిఎస్డిఓ, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు. ఈ ప్రోత్సాహం క్రీడాకారులకు మరింత ఉత్తేజాన్ని ఇస్తుందని అధికారులు తెలియజేశారు.

# పలు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన




**హైదరాబాద్ పెన్ పవర్:**సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ కె. హైమావతి పలు పర్యటనలు చేసారు. మద్దూరు మండలంలోని మద్దూరు, రేబర్తి గ్రామాలు దుల్మిట్ట మండలంలోనీ బైరాన్ పల్లి, దుల్మిట్ట, కొండాపూర్ గ్రామాలు మరియు అక్కన్న పెట మండలంలో రామవరం గ్రామపంచాయతిల లో నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మద్దూరు క్లస్టర్ లో మద్దూరు, గాగిల్లాపూర్, నర్సాయి పల్లి. రేబర్తి క్లస్టర్ లో రేబర్తి, వంగపల్లి, వల్లాం పట్ల. బైరాన్ పల్లి క్లస్టర్ లో బైరాన్ పల్లి, బెక్కల్, తోర్నాల. దుల్మిట్ట క్లస్టర్ లో దుల్మిట్ట, జాలపల్లి, లింగాపూర్. కొండాపూర్ క్లస్టర్ లో కొండాపూర్, కోటిగల్, దుబ్బతండ, హనుమ తండా, రెడ్నాయక్ తండా. రామవరం క్లస్టర్ లో రామవరం, పోతారం జె, కపూర్ నాయక్ తండా, నందరం, సేవాలాల్ మహరాజ్ తండా గ్రామాల నామినేషన్ స్వీకరిస్తునట్లు అధికారులు కలెక్టర్ కి తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి అనుసరిస్తూ జిల్లాలో 3 విడత నామినేషన్ ప్రక్రియ 9 మండలాల్లో ఆయా క్లస్టర్ లలో ఎక్కువ నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

# ప్రయాణికులకు ఇండిగో షాక్




**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలోని విమాన సర్వీసుల్లో ఏకంగా 64 శాతం వాటాతో తిరుగులేని అధిక్యతను ప్రదర్శించే ఇండిగో.. గడిచిన నాలుగు రోజులుగా తన తీరుతో ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది.నిర్వాహణపరమైన లోపాల కారణంగా భారీ ఎత్తున విమాన సర్వీసుల్ని రద్దు చేస్తోంది. ఇండిగో తీరుతో హైదరాబాద్.. బెంగళూరు.. ఢిల్లీ.. ముంబయి, తిరుపతి విమానాశ్రయాల్లో ఆ విమానాల్లో టికెట్లు కొనుగోలు చేసిన వారంతా తీవ్ర అవస్థలకు గురయ్యారు.శుక్రవారం పరిస్థితే తీసుకుంటే.. ఇండిగోకు చెందిన ప్రతి మూడు విమానాల్లో రెండు ఆలస్యంగా నడిచాయి. మొత్తంగా 550కు పైగా జాతీయ.. రేణిగుంట విమానాశ్ర యం కూడా 6 విమానాలు రద్దు కావటం గమనార్హం. పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి.ఆలస్యం కావటం అప్పుడప్పుడు జరిగేదే. ఇండిగో విషయంలో వచ్చిన సమస్య ఏమంటే.. చెకిన్ పూర్తై లోపలకు వెళ్లిన తర్వాత సదరు విమాన సర్వీసు రద్దు అయ్యిందని చెప్పటం. ఇలాంటి పరిస్థితిని బాధ్యతారాహిత్యానికి మించిన పెద్ద మాటను అనాల్సి ఉంటుంది.ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇండిగో సేవలు సాధారణ స్థాయికి చేరటానికి ఎంత సమయం పడుతుంది? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఇప్పటివరకు పక్కాగా.. తాము అనుకున్న సమయానికి గమ్యస్థానానికి చేరుకోవాలని భావించే ప్రయాణికుల్లో అత్యధికులు ఇండిగోను ప్రయారిటీగా తీసుకొని అందులోనే ప్రయాణించేలా ప్లాన్ చేసుకునే వారు.ఇప్పుడు అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది


# స్క్రబ్ టై ఫస్ వ్యాధిపై అవగాహన

**హైదరాబాద్ పెన్ పవర్:**స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలుకు దొడ్డిసచివాలయ ఏఎన్ఎం మంగమ్మ పేర్కొన్నారు. ఈ వ్యాధి గూర్చి గ్రామ ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మంగమ్మ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి రికె టిసియా అను బ్యాక్టీరియా వలన సోకుతుందని గ్రామాలలో పశువులకు ఉండే పిడుదలు మరియు చిడుములు ద్వారా సంక్రమిస్తుందని ఈ మైట్స్ అతి చిన్నగా రెండు మిల్లీమీటర్ల పొడవుతో ఎర్రగా ఉండి ఎనిమిది కాళ్లు కలిగి ఉంటుందని ముఖ్యంగా ఎలుకలు, చుంచు ఎలుకలు, పందికొక్కులు రక్తం పీలుస్తూ పరాన జీవులుగా నివసిస్తాయి, ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన తలనొప్పి, జ్వరం, వంటినొప్పులు, శరీరం మీద దద్దుర్లు అలాగే చర్మంపై మైటలార్వా కొట్టిన చోట నొక్కబడినట్లున్న ఎర్రటిపండు ఏర్పడి నల్లని పెచ్చులతో కూడి ఉంటుంది. ఈ వ్యాధి మనిషి నుండి మనిషికి వ్యాపించదు. ముఖ్యంగా ఈ వ్యాధి నివారణకు ఎలుకలను నిర్మూలించడం అవసరం అలాగే రైతులు పొలముల యందు గడ్డి కోయు వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి హేమలత, ఆశ వర్కర్ ఈరమ్మ గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.

## సేవ చేయని జీవితం నిరర్థకం

**హైదరాబాద్ పెన్ పవర్:**సమాజానికి సేవ చేయని జీవితం నిర్ధరకమని, మనం పోయిన తర్వాత కూడా మన గురించి తలుచుకోవాలంటే సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 17వ వార్షిక బ్లడ్ డొనేషన్ క్యాంపు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని తాను నమ్ముతానని అన్నారు. యువత కనీసం ఆరు నెలలకోసారి రక్తదానం చేసే విధంగా ప్రోత్సహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకుల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు దేశ వ్యాప్తంగా ప్రతియేటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 5 లక్షల 80 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించడం గొప్ప విషయమని అన్నారు. స్వాతంత్ర్యం రాకముందు ప్రపంచ దేశాల్లో భారతదేశం జీడీపీ నాల్గో వంతు ఉండేదని అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను మరింత శక్తివంతం చేసి దేశం ముందుకు సాగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, ఆర్‌బీఐ సీజీఎం సంగాల సుబ్బయ్య, నేషనల్ పోలీస్ అకాడమీ జేడీ శ్రీనివాసవర్మ, రిటైర్డ్ ఐపీఎస్ శ్రీనివాస్‌రావు, హెచ్‌ఎఫ్‌సీ బ్యాంకు వైస్ ప్రెసిడెంట్లు కె. శ్రీనివాసరాజు, సాయి ప్రకాశ్, బుర్రా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు సందర్భంగా సీపీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:**
గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పటిష్ట చర్యలు చేపట్టింది. శుక్రవారం నాడు కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, కరీంనగర్ రూరల్, హుజురాబాద్ డివిజన్ లోని ఉన్నతాధికారులు, క్లస్టర్ ఇంచార్జిలు, రూట్ ఇంచార్జులు, గ్రామ పోలీసు అధికారులందరితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. ఎన్నికల బందోబస్తు ప్రణాళిక అమలుపై స్టేషన్ హౌస్ అధికారులకు ఎస్ హెచ్ఓఎస్, దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సందర్భంగా అధికారులు చేయవలసిన మరియు చేయకూడని పనుల గురించి చిన్న హ్యాండ్‌బుక్‌లెట్‌ను తయారు చేసి అందరికీ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ బుక్‌లెట్‌లో ఎన్నికల నియమావళి మరియు భద్రతా ప్రణాళికకు సంబంధించిన వివరాలు క్షుణ్ణంగా పొందుపరిచినట్లు సీపీ వెల్లడించారు.

రూట్లు, క్లస్టర్ల విభజన మరియు సిబ్బంది మోహరింపు

కమీషనరేట్ పరిధిలోని కరీంనగర్ రూరల్, హుజురాబాద్ డివిజన్లలోని 15 పోలీసు స్టేషన్ల పరిధిని పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా విభజించారు:

రూట్ల సంఖ్య: 104

క్లస్టర్ల సంఖ్య: 57

క్లస్టర్ ఇంచార్జిలు: 83 మంది అధికారులు

గ్రామ పోలీసు అధికారులు విపీఓఎస్: క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాలు కవర్ అయ్యేలా మొత్తం 309 మందిని నియమించారు.

బందోబస్తు పర్యవేక్షణ:

ఎన్నికల ప్రారంభం అయ్యేవరకు క్షేత్రస్థాయిలో మొత్తం 508 మంది పోలీసు అధికారులు నిరంతరంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. పర్యవేక్షణ బాధ్యతలను ఉన్నతాధికారులకు అప్పగించారు:

పర్యవేక్షణ ఏసీపీ స్థాయి,2 గురు ఏసీపీ స్థాయి అధికారులు

పూర్తిస్థాయి పర్యవేక్షణ: 4 ఇన్‌స్పెక్టర్లు

క్షేత్రస్థాయి పర్యవేక్షణ: 25 మంది ఇన్‌స్పెక్టర్లు మరియు స్టేషన్ల ఎస్సైలు,

రౌడీ షీటర్లపై కఠిన చర్యలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండేందుకు, కమిషనరేట్ పరిధిలోని రౌడీ షీటర్ల బైండోవర్‌లను పూర్తిగా పూర్తి చేశామని సీపీ తెలిపారు. వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు పూర్తిగా సహకరించాలని సీపీ గౌష్ ఆలం గారు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు,ఏసీపీ లు శ్రీనివాస్ జి. వేణుగోపాల్, వాసాల సతీష్ లతో పాటు ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు సిబ్బందిపాల్గొన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరిచే ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో సాగేందుకు పోలీస్ శాఖ పరంగా కావలసిన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.. శుక్రవారం ఇబ్రహీంపట్నం,మెట్ పల్లి, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ స్వయంగా పరిశీలించి భద్రత పరంగా చేయవలిసిన ఏర్పాట్ల గురించి అదికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రల దగ్గర ప్రహరీ గోడ, కరెంట్, వాటర్ మొదలగునవి ముందస్తు అవసరాలు అక్కడ ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మొదటి విడత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందని అన్నారు. మొదటి విడతకు సంబంధించిన 122 గ్రామాలు ,1172 వార్డ్ లలోఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని దీనికి సంబంధించి మొత్తం 1172 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ ఎస్ఎస్ 163 ఆక్ట్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు.ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. ప్రజలంతా ఎలక్షన్ సమయంలో పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట మెట్ పల్లి, కోరుట్ల సి.ఐ లు అనిల్ కుమార్ ,సురేష్ ,ఎస్.ఐ లు అనిల్ కిరణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# మూడవ విడత గ్రామ పంచాయితీ నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**
మూడవ విడత సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా గొల్లపల్లి మండలంలోని గుంజపడుగు, చిలువకోడూర్ ఇబ్రహీంనగర్ గ్రామంలోని సర్పంచి ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి,బద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఉన్న పోలీసు సిబ్బందికి ఎన్నికల నిబంధనల ప్రకారం 100 మీటర్ల పరిధి నిబంధనలను అమలు చేయాలని నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతి లేకుండా వ్యక్తులను పంపవద్దని అన్నారు.అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని అన్నారు. అదనపు ఎస్పీ వెంట ఎస్.ఐ లు కృష్ణ సాగర్ రెడ్డి ,సిబ్బంది ఉన్నారు.

# కోమటిరెడ్డి యూటర్న్.. పవన్ పై విమర్శలపై ఆసక్తికర వివరణ



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి యూటర్న్ తీసుకున్నారా? ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై ఇటీవల తీవ్ర విమర్శలకు దిగిన మంత్రి కోమటిరెడ్డి శుక్రవారం రాజధాని అమరావతికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అప్పటి పరిస్థితుల మేరకు పవన్ పై విమర్శలు చేయాల్సివచ్చిందంటూ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ కి తగినట్లు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్ గా అభివృద్ధి చెందుతోందని అన్నారు.

హైదరాబాదులో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించేందుకు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి మంత్రి కోమటిరెడ్డి వచ్చారు. చంద్రబాబు విజన్ 2020 అభివృద్ధికి ప్రతిరూపం హైదరాబాద్ అంటూ వ్యాఖ్యానించారు. ఇక ఏపీ ఉప ముఖ్యమంత్రిపై చేసిన విమర్శలకు వివరణ ఇస్తూ అప్పటి పరిస్థితుల మేరకు ఆ వ్యాఖ్యలు చేశానంటూ స్పష్టం చేశారు. ఇప్పుడు చంద్రబాబును ఆహ్వానించడానికి వచ్చా.. రెండు రాష్ట్రాలు కలిసి ఉండాలి. అదే స్నేహం కొనసాగాలి అంటూ అభిప్రాయపడ్డారు.ఇక గత నెల 26న పవన్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో రాజకీయ దుమారానికి దారితీశాయి. కోనసీమ అందాలు గొప్పగా ఉంటాయని తెలంగాణ నేతలు తనతో అనేవారని, బహుశా వారి దిష్టి తగలడం వల్లే కొబ్బరి అందాలు పోయాయని అనిపిస్తోందని పవన్ నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఇలా పవన్ మాట్లాడిన రెండు రోజుల తర్వాత బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి విమర్శలకు దిగడంతో రాజకీయ రచ్చ ప్రారంభమైంది. ఆ తర్వాత ఈ ఎపిసోడులోకి ఎంటరైన కాంగ్రెస్ మంత్రులు ఏపీ ఉప ముఖ్యమంత్రిపై తీవ్ర విమర్శలతో రచ్చ రచ్చ చేశారు.ఈ క్రమంలోనే మంత్రి కోమటిరెడ్డి చేసిన విమర్శలు తీవ్ర దుమారానికి తెరతీశాయి. పవన్ క్షమాపణలు చెప్పకపోతే ఆయన సినిమాలను తెలంగాణలో ఆడనిచ్చేది లేదంటూ మంత్రి కోమటిరెడ్డి వార్నింగ్ ఇవ్వడంపై తీవ్ర చర్చ జరిగింది. ఆయన హెచ్చరికలపై పవన్ అభిమానులు ఘాటుగా స్పందించారు. మంత్రిపై సోషల్ మీడియా వేదికగా విమర్శలకు తెరలేపారు. ఇలా పవన్ అభిమానులు వర్సెస్ కాంగ్రెస్ మంత్రులుగా సాగుతున్న వివాదం ఎటు దారితీస్తుందోనని ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో మంత్రి కోటమిరెడ్డి తాజా వ్యాఖ్యలతో అంతా గప్ చుప్ అయినట్లేనని అంటున్నారు.

# పంచాయతీ ఫలితం తర్వాత.. రేవంత్ 'కీలక' నిర్ణయాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుతం తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నెల 11 నుంచి మూడు విడతల్లో గ్రామ పంచాయతీలకు, మండలస్థానాలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ఎన్నికలను ప్రాణ ప్రదంగా భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ వీటిలో వచ్చే ఫలితాలను అధ్యయనం చేయడం ద్వారా తదుపరి కార్యాచరణకు రెడీ అవుతుందన్న చర్చ జరుగుతోంది.దీనిలో ప్రధానంగా ప్రాజెక్టులు, బీఆర్ ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేల రాజీనామాలు వంటి కీలక నిర్ణయా లు ఉన్నాయని తెలుస్తోంది.

ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డికి సానుకూలంగానే రాష్ట్ర ప్రజలు ఉన్నారన్న చర్చ జరుగుతోంది. అయితే.. దీనికి ప్రాతిపదిక కనిపించడం లేదు. ఈ క్రమంలో ఇప్పుడు జరగనున్న పంచాయతీ ఎన్నికల తర్వాత.. ఆ పార్టీకి మద్దతు ఏ రేంజ్‌లో ఉందో తెలుసుకుంటారు. అనంతరం.. కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తారన్న చర్చ సాగుతోంది.ముఖ్యంగా పలు ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంది. దీనిలో భాగంగా ఫ్యూచర్ సిటీనుంచి అమరావతి వరకు నిర్మించనున్న ప్రధాన రహదారి పనులకు భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇది ఇప్పటికిప్పుడు చేయడం ద్వారా ఇబ్బందులు వస్తాయని గ్రహించిన సర్కారు వాయిదా వేస్తోంది. అదేవిధంగా జంపింగు నాయకులతో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచన కూడా చేస్తున్నారు. అయితే.. ఈ విషయంలోనూ ప్రజానాడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

దీంతో పంచాయతీ ఎన్నికలను ప్రాతిపదికగా తీసుకుని తర్వాత నిర్ణయాలు ఉంటాయన్న చర్చ ఉంది. వాస్తవానికి పంచాయతీ ఎన్నికల్లో జెండా, అజెండా ఉండవు. అయినా.. పార్టీల మద్దతు దారులు రంగంలోకి దిగుతున్నారు. దీంతో కాంగ్రెస్ హవా గ్రామ పంచాయతీల స్థాయిలో భారీగా కనిపిస్తే.. అప్పుడు రాష్ట్ర స్థాయిలో నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి.. వేచి చూస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే.. పంచాయతీ ఎన్నికలను కీలకంగా భావిస్తున్నారు.

## సాయి ఈశ్వర్ మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**గురువారం నాడు పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు పాల్పడి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సాయి ఈశ్వర్ చారి(30)) మృతి చెందాడు..సాయి ఈశ్వర్ చారి సొంత ఊరు సంగారెడ్డి జిల్లా.. పుల్కల్ మండలం.. పోచారం విలేజ్ కాగా ఇతనికి భార్య కవిత తోపాటు తల్లి ప్రమీల..ఇద్దరు కూతుళ్లు ఓ కొడుకు( పెద్ద కూతురు కృత్తిక(3 సంలు) కృష్ణ దత్త(2 సం లు) చిట్టి(1 సం) ఉన్నారు..సాయి ఈశ్వర్ చారి బ్రతుకుదెరువు కోసం జీడిమెట్ల సమీపంలోని జగద్గిరిగుట్ట నివాసం ఉంటూ క్యాబ్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు..సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం జగద్గిరిగుట్టలోని సాయి ఈశ్వర్ చారి ఉండే నివాసనికి తరలించి అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు...కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతంఅమలు చేయాలని ఆత్మహత్యకు పాల్పడినట్లు బీసీ సంఘాల నాయకులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ధర్నాలు.. ఆందోళనలు చేయగా పోలీసులు అరెస్టులు చేశారు..ద

## చదువుతోనే మంచి భవిష్యత్తు

**హైదరాబాద్ పెన్ పవర్:**చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని విశాఖ జిల్లా కలక్టరు హరేందిర ప్రసాద్ అన్నారు.విశాఖ ఉత్తర నియోజక వర్గ శాసన సభ్యులు విష్ణుకుమార్ రాజుతో కలసి అక్కయ్యపాలెం ఎన్జీవో కోలనీలో, జివిఎంసి హై స్కూలులో తల్లిదండ్రులు, ఉపా ధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశములో కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రు లు ఆడ పిల్లల చదువుపై మరింత దృష్టి పెట్టాలన్నారు.ఆడపిల్లలు బాగా చదువుకుంటే బాల్య వివాహ సమస్య ఉత్పన్నం కాదన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు క్రమశిక్షణ నేర్పాలన్నారు. తల్లిదండ్రులు క్రమశిక్షణ కలిగి ఉం టే పిల్లలకు కూడా మంచి క్రమశిక్షణ అలవాటవుతుం దన్నారు. క్రమశిక్ష ణ పాటించినవారు అన్ని రంగాల లో విజయమంతమవుతారన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ అవసరం అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నారా లోకేష్ చొరవతో మెగా పేరెంట్ టీచర్ మీట్ 3.0 జరుగుతుందన్నారు.